## క్లుప్తంగా

### ఘనంగా కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పట్నాయక్

**హిరమండలం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీతఎస్ పట్నాయక్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సహకరిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకుల సహకారంతో ఉత్తమ విద్యాబోధన అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు సక్రమంగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అట్రాసిటీ కేసుపై విచారణ



చీడివలసలో విచారణ చేపడుతున్న డీఎస్పీ బాలచంద్రారెడ్డి

**పోలాకి:** టీడీపీ నాయకుల చేతిలో దాడికి గురైన చీడివలస దళిత యువకుడు జోగి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు నమోదైన అట్రాసిటీ కేసును టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. చీడివలస గ్రామానికి వెళ్లి దాడి జరిగిన తీరును ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. పోలీస్‌శాఖ ద్వారా రక్షణ కల్పిస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నరసన్నపేట సీఐ ప్రసాదరావు, పోలాకి ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులు

**ఆమదాలవలస:** సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ఆర్.సింధు అన్నారు. పట్టణంలోని ధర్మారావు కోటర్స్‌లో గల శ్రీవెంకటేశ్వర ఐటీఐలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్‌ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, బ్యాంక్ లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఏటీఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వొద్దని సూచించారు. ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ కూన భానోజీరావు, కూన రాజేష్, ప్రిన్సిపాల్ ప్రసాదరావు, లెక్చరర్ శ్రీనివాసరావు, సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), రామారావు తదితరులు పాల్గొన్నారు.

### వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు



ఆలయ కొలతలు తీస్తున్న అధికారులు

**మెళియాపుట్టి:** మండల కేంద్రంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగానే సోమవారం దేవదాయశాఖ ఆలయ ఈఓ టి.వాసుదేవరావు ఆధ్వర్యంలో పలువురు అధికారులు ఆలయాన్ని సందర్శించారు. ఆలయం చుట్టుకొలత, అభివృద్ధి చేయడానికి ఆలయ పరిసరాల కొలతలను తీసుకున్నారు. ఈఓ మాట్లాడుతూ.. ఇటీవల దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆలయాన్ని పరిశీలించి వెళ్లారని, ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. అభివృద్ధిపై అంచనాలు తయారుచేసి అందిస్తామన్నారు. ఇంజినీరింగ్ అధికారి చందన, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నరసన్నపేట:** కోమర్తి–ఉర్లాం మధ్య కొత్తగా విద్యుత్ లైన్ వేస్తున్నందున మంగళవారం నుంచి గురువారం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉర్లాం ఏఈ బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. కోమర్తి, యారబాడు, లింగాలపాడు, మతలబుపేట, వీఎన్‌పురం, గోకయ్యవలస, చింతువానిపేటతోపాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

# రైతు సేవలో.. ఆర్‌బీకేలు



రావులవలసలో ఆర్‌బీకే వద్ద ఎరువులు పంపిణీ చేయిస్తున్న వ్యవసాయాధికారి (నేడు)






వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద విత్తనాల కోసం పడిగాపులు కాస్తున్న రైతులు (నాడు )

- నాటి కష్టాలు.. నేడు లేవంటున్న అన్నదాతలు
- రైతుల చెంతకే ఎరువులు, విత్తనాలు సరఫరా

**నరసన్నపేట:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల కష్టాలు తీరాయి. గత ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ కాలంలో విత్తనాలు కావాలన్నా, ఎరువులు కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లి క్యూలో ఉంటూ రోజంతా అవస్థలు రైతులు పడేవారు. అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఆనాటి రైతుల కష్టాలు వర్ణణాతీతం. ఇప్పుడు ఆ పరిస్థితులన్నీ మారాయి. ఇది రైతు ప్రభుత్వమని, రైతులకు ఎటువంటి కష్టాలు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని సీఎంగా బాధ్యతలు చేపట్టిన రోజే వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రకటించారు. ఆ తరువాత గ్రామాల్లో రైతుల చెంతకే రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోనికి తీసుకువచ్చారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 91 ఆర్‌బీకేలు ఏర్పాటు చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వ ధరలకు లభిస్తున్నాయి. ఆనాటి కష్టాలు ఇప్పుడు తీరాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**కష్టాలు తీరాయి**



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విత్తనాలు, ఎరువులు కావాలంటే అవస్థలు పడేవారం. 10 కిలో మీటర్లు దూరంలో ఉన్న నరసన్నపేటకు వెళ్లాల్సి వచ్చేది. ఒకటి, రెండు రోజులు పని పోయేది. ఇప్పుడు గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు ఆర్‌బీకేల ద్వారా అందుతున్నాయి. ఎన్నో కష్టాలు తీరాయి. వ్యవసాయ పనులకు అవసరమైన పెట్టుబడికి ముందుగానే డబ్బులను ఈ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేయడం ద్వారా వడ్డీ వ్యాపారుల బాధలు తప్పాయి.
– బగ్గు సతీష్, రైతు, ముద్దాడపేట, నరసన్నపేట మండలం

**సకాలంలోనే అందిస్తున్నారు..**



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రైతులకు అనేక ప్రయోజనాలు కలిగాయి. ప్రధానంగా ఎరువులు, విత్తనాలకు పడే కష్టాలు తీరాయి. టీడీపీ హయాంలో అయితే అవస్థలు పడేవారం. ఇప్పుడు వీఏఏల గ్రామానికి తీసుకువచ్చి రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ప్రభుత్వ ధరలకు సకాలంలోనే అందిస్తున్నారు.
– రావాడ మోహన్‌రావు, సర్పంచ్, మాకివలస

**సూచనలు, సలహాలు,**

అవసరమైన రైతులకు సూచనలు, సలహాలను వీఏఏల ద్వారా అందుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 2457 మెట్రిక్ టన్నుల యూరియా, 730 మెట్రిక్ టన్నుల డీఏపీ గడిచిన ఖరీఫ్‌లో రైతులకు అందించారు. నాలుగేళ్ల కాలంలో చూస్తే 9,828 మెట్రిక్ టన్నుల యూరియా, 2920 మెట్రిక్ టన్నుల డీఏపీ పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. గడిచిన ఖరీఫ్‌లో 4005 క్వింటాళ్ల వరి విత్తనాలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సరఫరా చేశారు. నాలుగేళ్లలో 15 వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు ఆర్‌బీకేల ద్వారా అందించారు.

# సీఎం జగన్‌తోనే సుపరిపాలన



గమేలాలో మట్టిని పడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**పాతపట్నం:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బోరుభద్ర గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. పెద్దచేరువులో ఉపాధి పనులను పరిశీలించారు. కొలతల మేరకు పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. రైతులకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వేతనదారులకు వివరించారు. విద్య, వైద్య రంగాల్లో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ సీఎం జగన్ గుర్తింపునిచ్చారన్నారు. మహిళల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులు చేపట్టిన జగనన్నకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి శ్రావణ్ కుమార్, రెడ్డి ఓం శ్రీకృష్ణ, ఏపీఓ సురేష్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు అర్జున్, తాతయ్య, సర్పంచ్‌లు ఎస్.శ్రీదేవి, ధర్మాన కుమార్ రెడ్డి, నాయకులు ఎస్.శ్రీనివాసరావు, మురళీ ఆప్టో, పనుకు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై అవగాహన



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**నరసన్నపేట:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పద్మావతి డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు కోరారు. ఈ మేరకు సోమవారం నరసన్నపేటలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక దేశవానిపేటలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు గతమూడు రోజులుగా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీటీ ఆర్.రామారావు ఓటు హక్కు గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డి.వి.రమణమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ కె.శ్రీరాములు పాల్గొన్నారు.

**ఎల్.ఎన్.పేటలో..**

**ఎల్.ఎన్.పేట:** ఓటు హక్కును పొందటం, ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవటం పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ (టెస్) అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అన్నారు. మండలంలోని తురకపేట సెంటర్‌లోని టెస్ కార్యాయలం వద్ద ఓటర్లకు, గ్రామస్తులకు ఓటు హక్కుపై సోమవారం అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు పొందేందుకు అర్హులన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించు కోవటం వల్ల మంచి నాయకులను ఎన్నుకోవచ్చన్నారు. నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టెస్ సంస్థ కార్యదర్శి డి.సుజాత, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

- టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



కొత్త చెరువును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

**పాతపట్నం:** ప్రభుత్వ భూములు, చేరువులు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ హెచ్చరించారు. మండలంలోని కొదూరు పంచాయతీ పరిధిలోని ప్రహరాజపాలెం రెవెన్యూ పరిధిలో గల కొత్త చేరువును రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రహరాజపాలెంలోని సర్వే నంబర్ 18లో 9.52 ఎకరాల కొత్త చెరువు విస్తీర్ణం వివరాలను తహసీల్దార్ వై.ఎస్.వి.వి.ప్రసాదరావును, మండల సర్వేయర్ రామగణపతిని అడిగి తెలుసుకున్నారు. చెరువు కబ్జాపై స్పందనలో ఫిర్యాదు రావడంతో సబ్‌కలెక్టర్ పరిశీలించారు. చెరువు కబ్జాకు గురైనట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కబ్జాకు గురైన స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఆర్ఐ భూవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### పరామర్శ..



సర్పంచ్, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**పాతపట్నం:** మండలంలోని సీది గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోను చిన్నప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతిని భార్య సర్పంచ్ పార్వతిని ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం పరామర్శించారు. సర్పంచ్‌కు, కుమారుడు గిరికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ గంగు శోభారాణి, గేదెల సూర్యం, ఇప్పిలి ధనుంజయ, మొర్రి రామకృష్ణ, దొర పార్వతీశం, రమణ ఉన్నారు.

### ప్రతీ విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి



ఆవిష్కరణలను ఆసక్తిగా తిలకిస్తున్న డిప్యూటీ ఈఓ విజయకుమారి

**పోలాకి:** జిల్లాలోని ప్రతి విద్యార్థిని భావిశాస్త్రవేత్తగా తీర్చిదిద్దేక్రమంలో ఆవిష్కరణలకు పదునుపెట్టాలని డిప్యూటీ ఈఓ ఆర్.విజయకుమారి అన్నారు. పోలాకి విశ్వశాంతి హైస్కూల్‌లో సోమవారం మెగా సైన్స్ ఎక్స్‌పో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 23 చోట్ల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని, అందులో అన్ని చోట్ల అద్భుతమైన ఆవిష్కరణలకు అవకాశం ఉందన్నారు. సైన్స్ డే ను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఇలాంటి విష్కరణలు( వర్కింగ్ మోడల్స్) విద్యార్థులతో నిర్వహించడం ఇదే తొలిసారి అని అన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామితో కలిసి ఆవిష్కరణలను ఆసక్తిగా తిలకించారు. సైన్స్‌తోనే భవిష్యత్ ఆధారపడి ఉందని, మరింత రాణించాలని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీనివాస నాయక్, లింగరాజు, పాఠశాల డైరెక్టర్ మెట్ట జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

### వేలం పాట ఖరారు

**నరసన్నపేట:** మేజరు పంచాయతీ నరసన్నపేటలో వేలం పాటలు ఎట్టకేలకు ఖరారయ్యాయి. రోజువారీ మార్కెట్ రూ.19.65 లక్షలకు, కార్ అండ్ బస్టాండ్ రూ.7.65 లక్షలకు ఇట్రాజు రామారావు వేలం పాడినట్లు ఈఓ సవర చిన్నారావు సోమవారం తెలిపారు. వారపుసంత రూ.4.25 లక్షలకు వెలమల ఆదినారాయణ పాడినట్లు తెలిపారు. సర్పంచ్ బూరల్లి శంకర్, వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త సమక్షంలో వేలంపాట నిర్వహించారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

**హిరమండలం:** పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.సుధాకర్ సూచించారు. మండలంలోని కిట్టాలపాడు, అక్కరాపల్లి, రెల్లివలస, పింధ్రువాడ, అంబావల్లి, భగీరథపురంలో పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి పెద్దపీట



కొత్తకోటలో పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- సహకార సంఘాన్ని ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం
- 22 మంది రైతులకు భూ పట్టాల పంపిణీ



రైతులకు డీ పట్టాలు పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

**సరుబుజ్జిలి:** రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మండలంలోని కొత్తకోట జంక్షన్ వద్ద రూ.60 లక్షల నిధులతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక సహకార సంఘాలకు రైతు భరోసా కేంద్రాలను అనుసంధానం చేసి ప్రభుత్వం రైతులకు చేదోడుగా నిలిస్తుందని వెల్లడించారు. రైతులకు సంబంధించిన విత్తు నుంచి విక్రయం వరకు ఆర్బీకేల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. సహకార వ్యవస్థ ద్వారా రైతుల పంట రుణాలు అందించడం జరుగుతుందన్నారు. సహకార బ్యాంకులను మరింత పటిష్టం చేయడం జరుగుతుందని వెల్లడించారు.

**డీ పట్టాల పంపిణీ..**

పేదవాడి అభివృద్ధి కోసం సీఎం జగన్ పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. కొత్తకోట జంక్షన్ వద్ద బూర్జ మండలం సుందరయ్యపేట గ్రామ రెవెన్యూ పరిధిలో కొండ పోరంబోకును దకరవలస గ్రామానికి చెందిన 22 మంది రైతులకు డీ పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, సీఈఓ రామారావు, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట ఎంపీటీసీ సభ్యుడు సురవరపు సింహాచలం, దకరవలస సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు వీఆర్వోలు ఉమామహేశ్వరరావు, తిరుపతిరావు, పార్టీ నేతలు సురవరపు శిమ్మినాయుడు, యువ నేత గండివలస ఉపేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబును ప్రజలు నమ్మరు



- కుప్పంను అభివృద్ధి చేయలేదు.. రాష్ట్రానికి ఏం చేస్తారు..
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**ఎల్.ఎన్.పేట:** ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పరిపాలన చేసి, 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంను అభివృద్ధి చేసుకోలేని దౌర్భాగ్యం ఏర్పడిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళంలో సోమవారం జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు అభివృద్ధి కోసం మాట్లాడటం, పలువురు నాయకులను విమర్శించటం విడ్డూరంగా ఉందన్నారు. కుప్పంను అభివృద్ధి చేయలేని చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెబితే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కుప్పం ప్రజలకు తాగు, సాగునీరు అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. 14 ఏళ్లలో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులు చంద్రబాబు ఎన్ని చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఉద్దానం కిడ్నీ సమస్య ఉందని, ఈ ప్రాంత ప్రజలకు మేలు జరిగేలా కిడ్నీ పరిశోధన కేంద్రం, ఆస్పత్రి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. కిడ్నీ వ్యాధులకు తాగునీరే కారణమని అనేక సర్వేలు చెప్పినప్పటికీ వారి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చంద్రబాబు ఎందుకు చొరవ తీసుకోలేని నిలదీశారు. బాబు పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ జరిగిన విషయాన్ని ప్రజలు ఇప్పటికీ మరచిపోలేకపోతున్నారన్నారు. జగనన్న అధికారం చేపట్టిన తరువాత గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి, వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల ఇంటి వద్దకే పరిపాలన తీసుకువచ్చారన్నారు. ఆసరా, చేయూత, అమ్మఒడి వంటి అనేక పథకాలతో మహిళలకు జగనన్న అండగా నిలిచారన్నారు. విత్తనాలు, ఎరువుల కోసం చంద్రబాబు పాలనలో రైతులు పడిన ఇబ్బందులు ఇప్పటికీ మరచిపోలేరన్నారు. అదే రైతుల ఇంటి వద్దకు ఎరువులు, విత్తనాలు జగనన్న ఇస్తున్నామన్నారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాతో గెలిచిన కలమట వెంకటరమణ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయించారని ఆరోపించారు. ఇసుక వ్యాపారం, నిర్వాసితులకు ఇచ్చిన పరిహారాన్ని స్వాహా చేసిన కలమట అవినీతి చంద్రబాబుకు కనిపించలేదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

# అరటి గెలల నీరాజనం



ఆలయ ప్రాంగణంలో వేలాడదీసిన అరటి గెలలు

**సారవకోట:** కిడిమి గ్రామంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సోమవారంతో ముగిసింది. మూడు రోజులపాటు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆఖరి రోజు ఆలయ ప్రాంగణంలో భక్తులు అరటి గెలలు వేలాడదీసి మొక్కులు చెల్లించుకున్నారు.

# ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి రాజశేఖర్

**బూర్జ:** ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని పెద్దపేట గ్రామ సచివాలయం పరిధి మదనాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 76 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, సుగర్‌తో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

# చక్రతీర్థ స్నానాల్లో అపశృతి

**సారవకోట:** చీడిపూడి గ్రామంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. శనివారం నిర్వహించిన చక్రతీర్థ స్నానాలకు హాజరైన బాడాన రామచంద్రరావు(18) ఎర్రన్నాయుడు కోనేరులో మునిగి చనిపోయాడు. కానీ ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. చీడిపూడి గ్రామానికి చెందిన ప్రభాకరరావు, రాధ దంపతుల కుమారుడు రామచంద్రరావు. తల్లిదండ్రులు విడిపోవడంతో రామచంద్ర తండ్రితో పాటు చీడిపూడిలో ఉంటున్నాడు. శనివారం ప్రభాకరరావు వ్యాపార రీత్యా వేరే చోటకు వెళ్లగా రామచంద్ర ఎదురింటి వాళ్లకు ఇంటి తాళం ఇచ్చి చక్రతీర్థ స్నానాలకు వెళ్లాడు. తండ్రి ఇంటికి వచ్చి చూసే సరికి కొడుకు కనిపించలేదు. ఎదురింటి వారు కూడా ఇంకా రాలేదని చెప్పడంతో చక్రతీర్థ ఉత్సవమంతా గాలించారు. చెరువులో కూడా వెతికినా లాభం లేకపోయింది. చివరకు జేసీబీలతో చెరువు గట్టు కొట్టి నీటిని బయటకు తరలించగా ఊబిలో శవమై కనిపించాడు. విషయం తెలిసిన తల్లి రాధా కూడా గ్రామానికి వచ్చి బోరున విలపించింది. రామచంద్రరావు నరసన్నపేటలోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దీనిపై సారవకోట పోలీసుస్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని హెచ్‌సీ సింహాచలం తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com